భర్తకు ఏడాదిన్నర జైలు

ముస్తాబాద్/గాంధీచౌక్, అక్టోబర్21: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసిన భర్తకు ఏడాదిన్నర జైలుశిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించారు. ఎస్ఐ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దొమకొండ మండలం తుల్జాపూర్‌కు చెందిన సుంకరి రాజుకు ముస్తాబద్ మండలం గూడెం గ్రామనికి చెందిన మేఘమాలతో 2010లో వివాహం కాగా, వీరికి ఒక కొడుకు ఉన్నాడు. కొన్నేండ్ల నుంచి అదనపు కట్నం తేవాలని భార్యను వేధింపులకు గురి చేయడంతో 2015లో రాజుపై ముస్తాబాద్ ఠాణాలో కేసు నమోదైంది. అప్పటి ఎస్ఐ మారుతి చార్జ్‌షీట్ దాఖలు చేయగా, ప్రాసిక్యుషన్ తరపున పీపీ సందీప్ వాదించారు. పోలీసులు కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది. దీంతో సుంకరి రాజుకు ఏడాదిన్నర జైలుశిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని ఎస్ఐ తెలిపారు.

వినియోగదారుడిగా వచ్చి..
విలువైన సామగ్రిచోరీ

వేములవాడ, అక్టోబర్ 21: వస్తువులు కొనుగోలు చేస్తానని నమ్మబలికి విలువైన సామగ్రిని చోరీ చేసిన ఘటన వేములవాడ పట్టణంలో చోటుచేసుకున్నది. పట్టణంలోని మటన్ మార్కెట్ ప్రాంతంలో ఆగయ్య చికెన్ సెంటర్ నిర్వహిస్తూ నీటి డ్రమ్ములు కూడా విక్రయిస్తుంటాడు. శనివారం అటువైపుగా వచ్చిన ఆగంతకుడు షాపులో ఎవరూ లేనిదిచూసి లోనికివచ్చాడు. బీరువాలోని వెండి వస్తువులతోపాటు ఇతర సామగ్రి చోరీ చేశాడు. షాప్ యజమాని కుమారుడు అటు వైపుగా రావడంతో.. డ్రమ్ములు కొనేందుకు వచ్చానని నమ్మబలికాడు. అయితే ధర చెప్పడంతో అంతకు కుదరదని అక్కడి నుంచి జారుకున్నాడు. సదరు యజమాని తీరా బీరువా తెరిచి చూడగా, అందులోని వస్తువులు లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమెరాలో రికార్డయిన సదరు అనుమానుతుడి చిత్రాలను పోలీసులు సోమవారం విడుదల చేశారు.

రైతు సంక్షేమమే ధ్యేయం: విప్

బాలానగర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, అక్టోబర్21: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని బాలానగర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవితో కలిసి సోమవారం విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, రైతులు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరతోపాటు సన్నరకం వడ్లకు క్వింటాల్‌కు ₹500 బోనస్ పొందాలన్నారు. రైతులకు మేలు కలిగే కార్యక్రమాలు రాబోయే రోజుల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. సాంకేతిక సమస్యలతో కొందరికి రుణమాఫీ కాలేదని, వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడ మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేశ్, వైస్ చైర్మన్ తూం కాంతరావు, డైరెక్టర్లు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ నిర్మాణం చేపడుతాం

రైతులకు అనువుగా ఉండేలా వ్యవసాయ మార్కెట్ నిర్మాణం చేపడుతామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి శివారులోని ప్రభుత్వ స్థలంలో నిర్మించే వ్యవసాయ మార్కెట్, స్టేడియం కోసం స్థలాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, మర్రిపల్లి ప్రధాన రోడ్డుకు అనుకుని విశాలమైన స్థలంలో మార్కెట్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. క్రీడాకారుల కోసం విశాల విస్తీర్ణంలో మినీ స్టేడియం, క్రికెట్ గ్రౌండ్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఇక్కడ ఆయా శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.

ఆరోపణలు అవాస్తవం

సిరిసిల్ల టౌన్, అక్టోబర్21: రాజకీయం లబ్ధి కోసం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో లడ్డూ కాంట్రాక్టుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని సిరిసిల్ల శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్లు తీగల శేఖర్‌గౌడ్, ఉప్పుల విఠల్‌రెడ్డి, చేపూరి నాగరాజు మండిపడ్డారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తామంతా సనాతన ధర్మాన్ని పాటించే వాళ్లమన్నారు. అందరి సమక్షంలోనే సదరు టెండర్ నిర్వహణ జరిగిందన్నారు.

అన్యమతస్తులకు కాంట్రాక్టు అవాస్తవం

శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రసాదం తయారీ కాంట్రాక్టు అన్యమతస్తులకు కేటాయించినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆలయ పర్యవేక్షణాధికారి మారుతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాదయ చట్టం ప్రకారం పులి మల్లేశం టెండర్ దక్కించుకున్నారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొత్తం రూ.1,19,513 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు.

నవీన్‌కుమార్‌కు పదోన్నతి

వేములవాడ, అక్టోబర్ 21: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ డిప్యూటీ కార్యనిర్వహణ అధికారిగా ప్రతాప్ నవీన్‌కుమార్ పదోన్నతి పొందారు. ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న నవీన్‌కుమార్ ఇటీవలే యాదగిరిగుట్టకు బదిలీ అయ్యారు. ఆలయానికి మంజూరు అయినప్పటికీ ఖాళీగా ఉన్న డీఈవో పోస్టుకు సీనియార్టీ గుర్తించి పదోన్నతిలో భాగంగా ఆయనకు ఈవో వినోద్‌రెడ్డి డీఈవోగా నవీన్‌కుమార్‌కు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కుట్టుశిక్షణతో ఉపాధి

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 21: మహిళలు కుట్టుశిక్షణతో స్వయంఉపాధిపై దృష్టి సారించాలని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ మాజీ సభ్యుడు ఓరగంటి ఆనంద్ సూచించారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో హార్వెస్ట్ మినిస్ట్రీస్ సహకారంతో తిరుపతి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్ల తోపాటు సర్టిఫికెట్లు అందజేశారు. ఇక్కడ డైరెక్టర్ రాయపాటి, కోఆర్డినేటర్ శ్రీధర్, పాస్టర్ సామ్యేల్ సందీప్ ఉన్నారు.

సిరిసిల్ల రూరల్: పెద్దూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

ముస్తాబాద్: మద్దికుంటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కోనరావుపేట: మల్కపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామ్మోహన్‌రావు

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- దళారులను ఆశ్రయించి నష్టపోవద్దు
- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బోయినపల్లి: కొదురుపాకలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, అక్టోబర్ 21: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపలి సత్యం సూచించారు. సోమవారం ఆయన మండలంలోని తడగొండ, అనంతపల్లి, బోయినపల్లి, కొదురుపాక, జగ్గారావుపల్లి, మాన్వాడ, నర్సింగాపూర్, విలాసాగర్, మర్లపేట గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, మాట్లాడారు. రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇక్కడ తహసీల్దార్ పుష్పలత, ఏవో ప్రణీత, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు జోగిన పల్లి వెంకట్రామరావు, కిషన్‌రెడ్డి, దుర్గారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టాపల్లి సుధాకర్, నాయకులు బొలుమాల శంకర్, కూస రవీందర్, మహేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు ఉన్నారు.

ముస్తాబాద్, అక్టోబర్ 21: తెర్లుమద్ది, సేవాలాల్ తండా, గన్నెవానిపల్లి, తుర్కపల్లి, రామలక్ష్మణులపల్లె, మద్దికుంట గ్రామాల్లో పోతుగల్ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పోతుగల్ సహకార సంఘం చైర్మన్ తన్నీరు బాపురావు, ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణీనర్సయ్య, మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు ప్రారంభించారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య, మండల సర్పంచులఫోరం మాజీ అధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏళ్ల బాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ వెల్ముల రాంరెడ్డి, డైరెక్టర్లు రాగం కొమురయ్య, మామిండ్ల శ్రీకాంత్, లకావత్ మున్నా, కదిరె సత్తయ్యగౌడ్, మాజీ సర్పంచులు దమ్మ రవీందర్‌రెడ్డి, ఈసరి కృష్ణ ,రేసు లక్ష్మి, కాశోళ్ల పద్మ, నాయకులు మల్లేశం, కరుణాకర్, దుర్గప్రసాద్, సొసైటీ కార్యదర్శి కృష్ణ, తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట, అక్టోబర్ 21: నాగంపేట, రాజేశ్వర్‌రావునగర్‌లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ సోమవారం ప్రారంభించారు. ఇక్కడ సీఈవో రాజిరెడ్డి, నాయకులు అంజిరెడ్డి, నాగభూషణం, బాపురెడ్డి, రాజవీర్, రాజిరెడ్డి, వెంకటి, బాబు, తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 21: బాకుర్‌పల్లితండాలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ సాబేరా బేగం సోమవారం ప్రారంభించారు. ఇక్కడ ఏపీఎం మల్లేశం ఉన్నారు.

కోనరావుపేట, అక్టోబర్ 21: కొలనూర్ సింగిల్ విండో పరిధిలోని మల్కపేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు ప్రారంభించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా, సెంటర్‌లో పోసి మద్దతు ధర పొందాలని సూచించారు.

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 21: పెద్దూరు సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ జీల కిషన్‌యాదవ్‌తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప ప్రారంభించారు. ఇక్కడ కౌన్సిలర్లు చెన్నమనేనీ కీర్తి, కమలాకర్‌రావు, రెడ్యానాయక్, లింగంపల్లి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు, ఏఎంసీ, పీఏసీఎస్ డైరెక్టర్లు, తదితరులు ఉన్నారు. అలాగే తంగళ్లపల్లి మండలం నేరెళ్ల సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఏఎంసీ చైర్‌పర్సన్ వెలుముల స్వరూప, సింగిల్‌విండో చైర్మన్ కొడూరి భాస్కర్‌గౌడ్ ప్రారంభించారు. ఇక్కడ ఏఎంసీ వైస్‌చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస రెడ్డి, డైరెక్టర్లు తాండ్ర రవీందర్‌రావు, అబ్బాడి అనిల్ రెడ్డి, కొమ్మెటి రాజిరెడ్డి, ఆసరి బాలరాజు, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్, పరశురాములు, రైతులు ఉన్నారు.

చందుర్తి: పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల రూరల్: పోలీస్ బెటాలియన్‌లో పుష్పగుచ్ఛంతో నివాళులర్పిస్తున్న కమాండెంట్ శ్రీనివాసరావు

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- లింగంపేట శివారులో అమరవీరుల స్తూపం వద్ద నివాళి
- హాజరైన ఎస్పీ అఖిల్‌మహాజన్

చందుర్తి, అక్టోబర్ 21: పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం లింగంపేట శివారులో గల అమరవీరుల స్తూపం వద్ద ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ శేషాద్రినీరెడ్డితో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శాంతిభద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ ఈ నెల 21నుంచి 31వరకు జాతీయ ఐక్యత కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరిస్తూ ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నదని తెలిపారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. ఇక్కడ ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

ముస్తాబాద్, అక్టోబర్ 21: మండల కేంద్రంలోని పోలీస్ ఠాణాలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గణేశ్ ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు.

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 21: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో గల స్మృతిపరేడ్‌లో అమరవీరులకు కమాండెంట్ శ్రీనివాసరావు నివాళులర్పించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల త్యాగాలు మరవలేనివని కొనియాడారు. ఇక్కడ అసిస్టెంట్ కమాండెంట్ ఉదయ్‌భాస్కర్, ఏవో ప్రమీల ఉన్నారు.

వీర్నపల్లి, అక్టోబర్ 21: గర్జనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు కొవొత్తులతో పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. ఇక్కడ ఇన్‌చార్జి హెచ్ ఎం ప్రేమ్‌సాగర్, టీచర్లు ఉమారాణి, బల రాంనాయక్, మంజుల, కవిత ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తాం

తెలంగాణ చౌక్, అక్టోబర్ 21: విద్యారంగ సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేస్తూ.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని సహస్ర కళాశాల ప్రాంగణంలో బీఆర్ఎస్‌వీ పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడం చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో కళాశాలలో కమిటీలు వేసి విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. ఇక్కడ నాయకులు శ్రీనివాస్, వెంకటేశం, అనిల్‌గౌడ్, తిరుపతి, విద్యార్థులు ఉన్నారు.

కంటి వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

దవాఖానలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజలింగం

బోయినపల్లి, అక్టోబర్ 21: కొదురుపాక బీసీఎం కంటి దవాఖాన ద్వారా అందించే కంటి వైద్య సేవలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీసీఎం కంటి దవాఖాన వ్యవస్థాపకుడు, ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డా వైరాగ్యం రాజలింగం-రీటాబహదూర్‌షా సూచించారు. ఆదివారం బీసీఎం కంటి దవాఖానలో 30మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేశారు. సోమవారం వారికి కంటి పరీక్షలు చేసి, మరో 30మందికి కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డా వైరాగ్యం రాజలింగం-రీటాబహదూర్‌షా దంపతులు మాట్లాడుతూ, ఇప్పటి వరకు 1,422 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా ప్రజలందరూ బీసీఎం కంటి దవాఖాన సేవలను వినియోగించుకోవాలని కోరారు. వారి వెంట కంటి వైద్యురాలు బిల్ల అనూషరెడ్డి, రిషబ్ మేనేజర్ దారవేని తిరుపతి, వైద్యుడు అన్వేష్, కౌన్సిలర్ రాజు, సిబ్బంది చంద్రయ్య, రాజు, రాజ్‌కుమార్, పావని, రమేశ్ ఉన్నారు.

హరిప్రసాద్‌కు ఆత్మీయ సన్మానం

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 21: ఎమిరెట్స్ పద్మశాలీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుబాయ్‌లో దసరా, దీపావళి ధమాకా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్‌ను ఆహ్వానించారు. వేడుకల్లో పాల్గొన్న ఆయన చేనేత మగ్గంపై తయారు చేసిన వస్త్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్‌ను నిర్వాహకులు సత్కరించారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి: ఎస్పీ

రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వీర్నపల్లి, అక్టోబర్ 21: పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర నాయ్యం జరిగేలా చూడాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం ఆయన వీర్నపల్లి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి, మాట్లాడారు. నేరాల నిరయంత్రణ కోసం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, కేటాయించిన గ్రామాలపై విలేజ్ పోలీస్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. తరుచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో సత్సబంధాలు కలిగిఉండాలని సూచించారు. గంజాయి రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ఎల్లాగౌడ్, సిబ్బంది ఉన్నారు.

కండ్లకు గంతలతో మాజీ సర్పంచుల నిరసన

కండ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 21: పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారంతో నాలుగో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల మాజీ సర్పంచులు నిరాహార దీక్షలో కూర్చుని కండ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించి వెంటనే పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ, సీపీఐ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, గుంటి వేణు దీక్షకు మద్దతు తెలిపారు. ఇక్కడ మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, ఉపాధ్యక్షురాలు శివజ్యోతి, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గంభీరావుపేట: చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, అక్టోబర్ 21: శ్రీగాధ మాజీ సర్పంచ్ మాణిక్యరావు సతీమణి సంవత్సరీక కర్మ కార్యక్రమానికి నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు సోమవారం హాజరై, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, నాయకులు కమ్మరి రాజారాం, మోతె రాజిరెడ్డి, లింగంయాదవ్, శ్రీనివాస్‌రావు, తదితరులు ఉన్నారు.

కోనరావుపేట, అక్టోబర్ 21: నిమ్మపల్లిలో పాత్రికేయులు కరుణాకర్, నరేశ్ తల్లి ఇటీవల మృతిచెందగా, సదరు కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఇక్కడ దొంతరవేని శ్రీనివాస్, కదిరె శ్రీనివాస్, తిరుపతిగౌడ్, ప్రవీణ్, రాములునాయక్ ఉన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ముస్తాబాద్, అక్టోబర్ 21: విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేత కంచర్ల రవిగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నట్లు గొప్పలు చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో పాటించడం లేదని ఆరోపించారు. పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని నిధులు మంజూరు చేయాలని కోరారు.

స్వయం ఉపాధిలో రాణించాలి

వేములవాడ, అక్టోబర్ 21: యువత స్వయంఉపాధిలో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, బీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి సూచించారు. కోరుట్ల బస్టాప్ ఏరియాలో మాధురి కేఫ్‌ను సోమవారం వారు ప్రారంభించారు. ఇక్కడ బీఆర్ఎస్ చందుర్తి మండలాధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, మాజీ సర్పంచులు శ్రీహరిరెడ్డి, కరుణాకర్, ముత్త మహేశ్, శ్రీనివాస్‌గౌడ్, కచ్చకాయల మహేశ్ ఉన్నారు.

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్స్ విధానంలో మార్పు

కలెక్టరేట్, అక్టోబర్ 21: జిల్లాలోని అర్హులైన ఎస్సీ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల నమోదుకు సంబంధించి నూతన విధి విధానాలను కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పాస్ వెబ్ సైట్‌లో మార్పు చేశామని ఎస్సీ అభివృద్ధి అధికారి మెట్టు విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాస్‌లో నమోదు ప్రక్రియ మూడు దశల్లో ఉంటుందన్నారు.

జీవో 29ను వెంటనే రద్దు చేయండి

కలెక్టరేట్, అక్టోబర్ 21: జీవో 29ను వెంటనే రద్దు చేసి లంబాడీలకు న్యాయం చేయాలని లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోత్ నరేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నరేశ్‌నాయక్ మాట్లాడుతూ, 90శాతం జనాభా కలిగిన ఎస్సీ, ఎస్టీ బీసీ కులాలకు 50శాతం రిజర్వేషన్ పరిమితం చేశారని మండిపడ్డారు. మరో వైపు 10శాతం ఉన్న అగ్రవర్ణాలకు 50శాతం రిజర్వేషన్ కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇక్కడ జిల్లా నేతలు శ్రీనివాస్ నాయక్, ప్రకాశ్‌నాయక్, తిరుపతి, గణేశ్, గోవర్ధన్‌నాయక్ ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, అక్టోబర్ 21: ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో సోమవారం వారు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఇక్కడ తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, ఎస్ నర్సయ్య, కొమురయ్య, శ్రీకాంత్, దుర్గయ్య, లక్ష్మీరాజం, పోశెట్టి, అజ్జ వేణు, ఏ దేవరాజు ఉన్నారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

చందుర్తి, అక్టోబర్ 21: కోనరావుపేట మండలం సుద్దాల శివారులో గత జూలై 25న కావేరి కాటన్ మిల్ వద్ద గంజాయి సరఫరా చేస్తున్న ఏడుగురు పై కేసు నమోదైంది. కాగా, పరారీలో మర్తన్నపేట గ్రామానికి చెందిన నీరటి సాయికుమార్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినటు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

స్వీప్ కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలి

కలెక్టరేట్, అక్టోబర్ 21: జిల్లాలో ఓటరు జాబితా సవరణ (2024-25) కోసం స్వీప్ కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు రూపకల్పనపై సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్ట